క్లుప్తంగా

నూతన కార్యవర్గం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని చింతకుంట వాడలో శ్రీ ఆంజనేయ కాలభైరవ యూత్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షుడిగా పొగుల హరీశ్, ఉపాధ్యక్షుడిగా మరిపెద్ది మహేశ్, ప్రధాన కార్యదర్శిగా బద్రి సాయి, కోశాధికారిగా మునిగెల మనీశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కౌన్సిలర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి సమావేశానికి హాజరు కావాలి

తానూరు: భైంసాలోని టెగ్డిలో ఉన్న బుద్ధవిహార్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి భారతీయ బౌద్ధమహా సభ సభ్యులు హాజరుకావాలని బౌద్ధమహాసభ జిల్లా అధ్యక్షులు రమేశ్ బాబు వాగ్మారే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి నియోజకవర్గంలోని ఆయా మండలాల భారతీయ బౌద్ధమహాసభ అధ్యక్షులు, శ్రామ్‌నేర్‌లు హాజరవాలని కోరారు.

గజ్జలమ్మ దేవికిపూజలు


పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ముంబై, నాందేడ్, బోకర్, ధర్మాబాద్, ఇస్లాపూర్, కిన్వట్ ప్రాంతాల భక్తులు ఆలయాలకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు న గేశ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అల ంకరణ, అర్చన, పల్లకిసేవ నిర్వహించారు. తులాభారం, తలనీలాలు అర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

కొనుగోలు కేంద్రాలు పరిశీలన


ఖానాపూర్ యార్డులో పరిశీలిస్తున్న ఆర్‌ఐ

ఖానాపూర్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుతోపాటు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆర్‌ఐ రాజేశ్వర్ సందర్శించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున అధికారుల ఆదేశాల మేరకు కొనుగోళ్లు వేగవంతం చేయాలని కేంద్రాల నిర్వాహకులు, సిబ్బందిని ఆదేశించారు. రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

వైద్య శిబిరానికి స్పందన

తానూరు: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం భైంసాలోని వేంకటేశ్వర మల్టీస్పెషాలిటి ఆస్పత్రి ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్య శిబిరం నిర్వహించారు. 60 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవలు అందించేందుకే ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యులు దయానంద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త డబ్బాల ఏర్పాటు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న ముత్యాల పోచమ్మ ఆలయం వద్ద ఆదివారం తడి, పొడి చెత్త డబ్బాలను ఏర్పాటు చేశారు. కాలనీవాసులు, భక్తుల విన్నపం మేరకు మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, వైస్‌చైర్మన్ కావలి సంతోశ్ ప్రత్యేక చొరవతో చెత్త డబ్బాలను ఏర్పాటు చేయించారు. పరిశుభ్రత మనందరి బాధ్యత అని.. ఆలయానికి వచ్చేవారు చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు చెత్త డబ్బాల్లో వేయాలని కోరారు. అర్చకులు శరత్‌చంద్ర శర్మ, కాలనీ వాసులు, తదితరులు ఉన్నారు.

గోవులను సంరక్షిద్దాం

కుంటాల: గోవులను సంరక్షించాలని జిల్లా గోసేవ ప్రముఖ్ కొత్త కాపు నారాయణ పేర్కొన్నారు. ఆదివారం కుంటాల గజ్జలమ్మ ఆలయ ఆవరణలో గోమాతను పూజిద్దాం –గోమాతను రక్షిద్దాం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. గోవులను అక్రమంగా రవాణా చేసే వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జక్కని గజేందర్, కడార్ల హరిప్రసాద్, తాటి శివ, జక్కుల గజేందర్, సోమ మోహన్, రంజిత్, గజేందర్ చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు

సారంగాపూర్: మండలంలోని ధని గ్రామానికి చెందిన దుబ్బాక సుశాంత్ (21) అనే యువకుడు అదృశ్యమైనట్లు ఆయన తండ్రి నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. శనివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన సుశాంత్ తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించినా సమాచారం తెలియరాలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె..

- ఈనెల 22 నుంచి 31వరకు కాల్వ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ
- పది రోజులపాటు వేడుకలు
- తరలిరానున్న భక్తజనం


ఆలయంలో స్వామివారు


కాల్వ అటవీ ప్రాంతంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ గ్రామపంచాయతీ పరిధి పరిసర అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 22 నుంచి 31 వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఏటా వైశాఖ మాసంలో జరిగే ఈ వేడుకలకు ఆలయ ప్రాంగణాన్ని అలంకరించి భక్తులకు ఇబ్బంది కల్గకుండా ఏర్పాట్లు చేసినట్లు వేదపండితులు చక్రపాణి నరసింహమూర్తి, శ్రీమాన్ వాసుదేవచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ పూజారం మహేశ్, ఈవో రంగు రవికిషన్‌గౌడ్ పేర్కొన్నారు.

ఇప్పటికే స్వామివారి ఊరేగింపునకు రథం సిద్ధం చేయడంతోపాటు కోనేటి వద్ద పరిసరాలను శుభ్రం చేశారు. 23న జరిగే స్వామివారి కల్యాణానికి మండపాన్ని సుందరంగా అలంకరించారు.

తేదీల వారీగా నిర్వహించే కార్యక్రమాలు..

- ఈనెల 22న (బుధవారం) ఉదయం స్థాపనం, నృసింహ జయంతితో ఉత్సవాలు ప్రారంభించడం జరుగుతుందని ఆలయ ఈవో తెలిపారు. సాయంత్రం స్వస్తీవాచనం, సకలదేవతా స్థాపనం, అంకురారోహణం, మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.
- 23న గురువారం ఉదయం శ్రీ క్రోధి నామ సంవత్సర వైశాఖ శుద్ధ చతుర్దశి నాడు ఉదయం నిత్యార్చన, అగ్నిప్రతిష్ఠ, యజ్ఞం నిర్వహించి మధ్యాహ్నం ధ్వజారోహణం, బలిహరణం, గరుడ ముద్దల అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.
- 24 నుంచి నిత్యపూజలో భాగంగా వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు. స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉదయం నిత్యార్చన, తీర్థప్రసాద వితరణ, సాముహిక నవగ్రహపూజ, సాయంత్రం హవణం, బలిహరణం
- ఈనెల 25న బేరీపూజ, 26న నిత్యపూజలతోపాటు పర్వతారోహణం, దీపారాధన, నివేదనలు
- ఈనెల 27న నిత్యార్చన, హోమం, బలిహరణం, పుష్కరిణిలో చక్రతీర్థ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.
- 28న తెల్లవారుజామున స్వామివారి నాగవెల్లి కార్యక్రమం.
- 29న స్వామివారి రథోత్సవం.. 30న నిత్యపూజాది కార్యక్రమాలు.
- ఈనెల 31న మారువెల్లి స్వామివారి సేవలు నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పండితులు పేర్కొన్నారు.

నిర్మల్ నుంచి ప్రత్యేక బస్సులు..

ఈనెల 23న గురువారం లక్ష్మీనర్సింహస్వామి వారి కల్యాణం రోజున నిర్మల్ బస్టాండ్ నుంచి ఆలయానికి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మహేశ్ పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు సైతం ఏర్పాటు చేశారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



బుధవారం నుంచి శ్రీ కాల్వ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఈనెల 22 నుంచి 31వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం.ఈసారి ఆలయ ప్రాంగణంలో నూతన కల్యాణ మండపం నిర్మించాం. గురువారం స్వామివారి కల్యాణానికి భక్తులు భారీగా తరలిరానున్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశాం. ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.

– పూజారం మహేశ్, ఆలయ కమిటీ చైర్మన్

ఘనంగా బోనాల పండుగ


ముధోల్‌లో బోనాలతో ఎల్లమ్మ ఆలయానికి వెళ్తున్న మహిళలు


భైంసారూరల్ : దేగాంలో బోనాలతో ఆలయానికి వెళ్తున్న గ్రామస్తులు

ముధోల్: మండల కేంద్రంలో ఆదివారం రేణుక ఎల్లమ్మ పండుగ ఘనంగా ప్రారంభమైంది.ఎగౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మకు బోనాలను నైవేద్యంగా సమర్పించారు. మహిళలు వీధుల గుండా శోభాయాత్రగా బోనాలతో ఆలయానికి చేరుకున్నారు. శివసత్తులు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు..

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో ఆదివారం పెద్దమ్మ తల్లి ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు, మహిళలు డప్పుచప్పుళ్ల నడుమ బోనాలు ఎత్తుకొని ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనం నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు భక్తులు పేర్కొన్నారు.

బుద్ధుడి బోధనలు అనుసరణీయం


ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో బుద్ధిస్టు సొసైటీ సభ్యులు

భైంసారూరల్: బుద్ధుడి బోధనలు, శాంతి, కరుణ, మైత్రి, నీతి, అహింస అనుసరణీయమని ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా భైంసాశాఖ అధ్యక్షులు ప్రసంజీత్ హేమ్లే అన్నారు. మండలంలోని సిద్దూర్ గ్రామంలో ఆదివారం ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా భైంసాశాఖ ఆధ్వర్యంలో బుద్ధుడి జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల ఆయన జీవిత చరిత్రపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించగా విజేతలుగా నిలిచిన అవదుత్ లక్ష్మి, మోతే అనుష్కకు జ్ఞాపిక, ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం విద్యార్థులకు బుద్ధుని జీవిత చరిత్ర పుస్తకాలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ మాధవరావ్, సొసైటీ సభ్యులు విఠల్ బిరదే, అడ్వకేట్ అశోక్ చంద్రే, దమ్మనంద్ దేవ్కే, ధర్మరాజ్, జాదవ్ లక్ష్మణ్, గౌతమ్ మోతే, సత్యశీల మోతే, సిద్దూర్ జై భీమ్ యువయూత్, బౌద్ధ ఉపాసిక, ఉపాసకులు, బౌద్ధాచార్యులు, కేంద్రీయ శిక్షకులు, కమిటీ సభ్యులు, అంబేద్కర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మురుగు పారేదెలా..?


మురుగు కాల్వ లేక రోడ్డుపైనే పారుతున్న నీరు

భైంసారూరల్: మండలంలోని వాడి గ్రామంలో డ్రెయినేజీలు లేకపోవడంతో రోడ్లపైనే మురుగు నీరు నిలుస్తోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది పరిసరాలు దుర్గంధభరితంగా తయారయ్యాయి. రోగాల బారిన పడటంతో పాటు రోడ్లపై నుంచి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీలు నిర్మించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపైనే మురుగునీరు, పిచ్చిమొక్కలు

పేకాటరాయుళ్ల అరెస్టు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో పే కాట ఆడుతున్న 12 మందిని ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ అనిల్ పేర్కొన్నారు. పక్కా సమాచారం మేరకు సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.16 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు సీఐ వెల్లడించారు. పేకాటడుతున్న వారిలో ప్రధాన పార్టీల నాయకులున్నట్లు గుర్తించామని వివరించారు.

కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు


పరీక్షలు చేస్తున్న సీఎస్‌సీ సిబ్బంది

భైంసాటౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు ఆవరణలో ఆ దివారం కార్మికశాఖ నుంచి గుర్తింపు పొందిన కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చే శారు. కార్మికశాఖ, సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో 55 రకాల వైద్య పరీక్షలు ఉ చితంగా నిర్వహించారు. ఈసందర్భంగా ర క్త, మూత్ర నమూనాలు సేకరించా రు. వారం రోజుల తర్వాత ఫలితాలు మెసేజ్ రూపంలో తెలియజేస్తామని పే ర్కొన్నారు. కార్యక్రమంలో డా. ముకేశ్, సీసీ సాయినాథ్, గజేందర్, అనిల్, అల్మాస్ తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన


చామన్‌పెల్లిలో మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి, రాచాపూర్ గ్రామాల్లో ఆదివారం త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు, ఓటుహక్కు వినియోగంపై ఎస్సై శ్రీకాంత్ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలకు కలిగిస్తే ఎంతటి వారినైనా వదలబోమని.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. దాతల సాయంతో ప్రతి వీధిలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ముస్తాబు

- నేటి నుంచి పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సం


ఆలయంలో పెద్దమ్మతల్లి

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి పెద్దమ్మతల్లి ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 20 నుంచి 24 వరకు ఆలయ నాలుగో వార్షికోత్సవ వేడుకలు ఉంటాయని గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘ సభ్యులు తెలిపారు. రామడుగు గ్రామానికి చెందిన బైండ్లోల్ల కళా బృందం ఆధ్వర్యంలో ఉత్సవాలు ఉంటాయని పేర్కొన్నారు. సోమవారం ఉత్సవాల ప్రారంభం సందర్భంగా పలు పూజాది కార్యక్రమాలతో పాటు మంగళవారం ఇంటింటా జోగు, బుధవారం పోచమ్మకు బోనాలు, గురువారం పెద్దమ్మతల్లికి సదరు బోనాలు, శుక్రవారం పెద్దమ్మతల్లి పండుగ ఉంటుందని వివరించారు.

కాలనీల్లోని సమస్యలు పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: పట్టణంలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ కాలనీలో పర్యటించారు. రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు, అభివృద్ధి పనులు చేపట్టాలని కాలనీవాసులు చైర్మన్‌ను కోరగా సానుకూలంగా స్పందించారు. త్వరలోనే రోడ్లు , డ్రెయినేజీ పనులు చేపడతామని చైర్మన్ పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, న్యాయవాది అల్లూరి మల్లారెడ్డి నివాసంలో కాలనీవాసులతో కలిసి అభివృద్ధి పనులు చర్చించారు. ఇందులో స్థానిక కౌన్సిలర్ నవనీత–సురేందర్, ముజాహిద్ తదితరులు ఉన్నారు.

వంతెనతో ఇక్కట్లు..


ఇరుకు వంతెనపై కూలిన రక్షణ గోడ

- శిథిలావస్థకు చేరిన హవర్గ- అర్లి వంతెన
- రాకపోకలకు అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు


వంతెన వద్ద నిలిచిన వాహనాలు

లోకేశ్వరం: మండలంలోని హవర్గ–అర్లి గ్రామాల మధ్య సుద్దవాగుపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. మరోవైపు వంతెన ఇరుకుగా మారడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వంతెనపై పెద్ద వాహనాలు వస్తే మరోవైపు ఆగాల్సిన పరిస్థితి నెలకొంది. రక్షణ గోడలు ధ్వంసం కావడంతోపాటు వంతెనపై ఏర్పడిన గుంతలు ప్రమాదకంగా మారాయి. అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

1981లో నిర్మాణం..

1981లో ఎస్సారెస్పీ అధికారులు సుద్దవాగుపై వంతెన నిర్మించారు. వంతెన ప్రారంభంలో ఇరువైపులా గోడలు పగుళ్లు తేలాయి. వర్షాకాలంలో వరద వంతెనపై నిలుస్తుంది. రెండు నెలల కిందట నాన్ ప్లానింగ్ రూ.1కోటి 80 లక్షలతో అర్లి నుంచి లోకేశ్వరం వరకు తారురోడ్డు నిర్మించారు. ఈ అర్లి వంతెన కూలితే తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు ఎలాంటి మార్గం లేదు.

జంకుతున్న వాహనదారులు..

మండలం నుంచి నిత్యం వందలాది వాహనాలు అర్లి వంతెనపై రాకపోకలు సాగిస్తుంటాయి. శిథిలావస్థకు చేరడంతో ఈ వంతెనపై రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు జంకుతున్నారు. ఎప్పుడు కూలుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఈ వంతెన ద్వారా నిర్మల్ చేరుకునేందుకు 45 కిలోమీటర్లు ప్రయాణంచాలి. ఒకవేళ వంతెన కూలితే భైంసా మీదుగా వెళ్లాలంటే 85 కిలోమీటర్ల దూరం అవుతుంది.

ప్రమాదం జరగకముందే అధికారులు, పాలకులు స్పందించి మరమ్మతులు చేట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి



ప్రస్తుతం వంతెన ఇరుకుగా మారింది. ఎదురెదురుగా వాహనాలు రాకపోకలు సాగించేందుకు కష్టమవుతోంది. సైడ్ వాల్స్ చిన్నగా మారాయి. నిధులు మంజూరు చేసి నూతన వంతెన నిర్మించాలి. వంతెనపై నుంచి ప్రయాణించాలంటే భయాందోళన చెందుతున్నాం.

– నల్ల రమేశ్, రాజూర

కూలితే ఇబ్బందులే



అర్లి వంతెన కూలితే నిర్మల్ ప్రాంతాలకు వెళ్లాలంటే దూరం పెరుగుతుంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రమాదం జరగకముందే అధికారులు మరమ్మతు చేపడితే ప్రయాణికులకు మేలు జరుగుతుంది.

– గొల్ల రసూల్, లోకేశ్వరం

భారీ వాహనాలు నిషేధించాం

అర్లి వంతెన శిథిలావస్థకు చేరుకున్న మాట వాస్తవమే. ఈవంతెనపై భారీ లోడ్ వాహనాలు రాకపోకలు సాగించకుండా నిషేధించాం. ఈ విషయమై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడుతాం.

– రఘు, ఆర్అండ్‌బీ ఏఈ, లోకేశ్వరం